క్లుప్తంగా

భోజనశాల నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు దంపతులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి మునగాల మండలం నారాయణగూడెంకు చెందిన ఊటుకూరి నాగేశ్వరరావు, ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.51,116ల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సాయి ట్రస్ట్ కమిటీ కన్వీనర్ మండవ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, మానసిక వికలాంగులకు శనివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఈశ్వర మాధవరం గ్రామానికి చెందిన కుందుల సురేందర్– ఉమ దంపతుల కుమార్తె డాలి సుమశ్రీ, చిలుకూరు మండలం కట్టకొమ్ముగూడెంకు చెందిన బూర రాకేష్–స్రవంతి దంపతుల కుమారుడు భవాని శంకర్ గౌడ్‌ల పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమానికి 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్, నాయకులు పోలంపల్లి ఉపేందర్, షేక్ అబ్దుల్ సురగాని పరుశురామ్, ఉపేందర్, ప్రవిజ్ఞ, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య పరామర్శ



సాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వట్టె జానయ్యయాదవ్

గరిడేపల్లి : మండలంలోని కాలువపల్లి గ్రామానికి చెందిన పొలగాని సాయి దశదిన కర్మకు శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఐలాపురం గ్రామ సర్పంచ్ బోడపట్ల సునితాశ్రీను, పొలగాని బాలుగౌడ్, ఆవుల అంజయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

నేరేడుచర్ల ఎస్‌ఐగా పరమేష్ బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ పరమేష్

నేరేడుచర్ల : నేరేడుచర్ల ఎస్‌ఐగా పచ్చిపాల పరమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ నవీన్‌కుమార్ సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా నల్లగొండ జిల్లా పెద్దవూరలో పనిచేస్తున్న పచ్చిపాల పరమేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. గంజాయి సరఫరా చేసే వారి సమాచారాన్ని తమకు తెలియజేయాలని చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అన్నారు. నూతన ఎస్‌ఐకి పోలీస్ సిబ్బంది, పలు రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : పాత చిలుకూరులో బొడ్రాయి, ముత్యాలమ్మ దేవాలయంలో నూతన విగ్రహాలు ప్రతిష్ఠించి 41 రోజులు అయిన సందర్భంగా శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆదివారం బోనాల మహోత్సవం ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీలు బెల్లంకొండ రమణనాగయ్య, వడ్డేపల్లి కల్యాణి కోటేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గరిణె శేషగిరిరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్లాక్‌బోర్డు చదువుకు బై బై

- 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ ఏడాది నుంచి డిజిటల్ క్లాసులు
- మండలంలో నాలుగు ప్రభుత్వ పాఠశాలల్లో అమలు
- ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు



వల్లాపురంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఐఎఫ్‌సీ ద్వారా సైన్స్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నడిగూడెం: సర్కార్ చదువు మారుతోంది. సరికొత్త పుంతలు తొక్కుతోంది. బ్లాక్ బోర్డు, చాక్‌పీస్ చదువుల నుంచి డిజిటల్ వైపు దూసుకెళ్తోంది. ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధించేందుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా నడిగూడెం మండలంలో మొదటి విడతలో మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, సిరిపురం, వల్లాపురం, తెల్లబెల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం డిజిటల్ తరగతులు ప్రారంభించారు. విషయ పరిజ్ఞానం పెంపొందించాలనే ఉద్దేశంతో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ డిజిటల్ విద్యా బోధన చేపడుతున్నారు. ప్రభుత్వం బోధన సౌలభ్యం కోసం పాఠశాలల్లో లక్షల రూపాయలతో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌సీ)లను, పరికరాలు సమకూర్చింది.

విద్యుత్ లేకుండా నాలుగు గంటలు

అయితే ప్రతి పాఠశాలలో మూడు తరగతులకు గాను మూడు ఐఎఫ్‌పీలను ప్రభుత్వం పంపిణీ చేసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినా ప్రతి ప్యానెల్ కనీసం నాలుగు గంటల పాటు పనిచేసేలా యూపీఎస్ ఏర్పాటు చేశారు. ఎలక్ట్రిఫికేషన్, నెట్‌వర్క్ కిట్లను కూడా సరఫరా చేశారు. 75 అంగుళాలున్న ఈ ప్యానెల్‌లను రెండు రకాలుగా వినియోగించుకోవచ్చు. డిజిటల్ తరగతుల బోధనతో పాటు, బ్లాక్ బోర్డుగా కూడా వినియోగించుకోవచ్చు. పాఠ్యాంశాలను చిత్రాలు, వీడియోల రూపంలో ఉపాధ్యాయులు అర్థవంతంగా వివరిస్తుండడంతో విద్యార్థులు ఆసక్తిగా పాఠాలు వింటున్నారు.

వెనుకబడిన వారికి మేలు

డిజిటల్ విద్యాబోధనతో చదువులో వెనుకబడిన విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుంటారు. సాధారణంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఒకసారి బోధించే పాఠ్యాంశాలను కొందరు విద్యార్థులు సరిగ్గా అర్థం చేసుకునే పరిస్థితి ఉండదు. దీన్ని అధిగమించేందుకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించిన అనంతరం డిజిటల్ తెరపై ప్రత్యక్ష రూపంలో మళ్లీ అవగాహన కల్పిస్తారు. ఈ విధానంలో పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, నూతన ప్రవేశాలు పెరుగుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

సెల్‌ఫోన్ ఇంటర్నెట్‌తో..

డిజిటల్ బోధన ప్రారంభించిన మండలంలోని నాలుగు పాఠశాలల్లో ప్రభుత్వం వైఫై నెట్‌వర్క్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో సంబంధిత ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్‌ల నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తూ పాఠ్యాంశాలు బోధిస్తున్నారు.

తొందరగా అర్థమవుతోంది



ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా పాఠ్యాంశం త్వరగా అర్థం అవుతోంది. వీడియోలను చూడడం వల్లో శాస్త్ర ప్రయోగాలు, మ్యాప్ పాయింటింట్ సులువుగా నేర్చుకోగలుతున్నాం. రంగురంగుల కలర్స్‌తో వైట్ బోర్డుపై నేర్చుకోవడం ఆసక్తిగా అనిపిస్తోంది. మానవుని గుండె పనితీరు, మెదడు నిర్మాణం, మానవుని జీర్ణవ్యవస్థ వంటివి వీడియోలో చూస్తుంటే సులువుగా అర్థం అవుతున్నాయి.

– పసుపులేటి జయలక్ష్మి, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్, సిరిపురం

ఆసక్తిగా వింటున్నారు



పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ను వాడుతూ పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా చూపిస్తూ బోధన చేస్తుండటంతో వి ద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు. చాక్‌పీస్, డస్టర్‌లు లేకుండానే బోధన చేస్తున్నాం. విద్యార్థులు అర్థం చేసుకోవడానికి, ఉపాధ్యాయులు పాఠాలు బోధించడానికి ఈ ఐఎఫ్‌సీ బాగా ఉపయోగపడుతోంది.

– వీఎల్‌ఎన్ చారి, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, వల్లాపురం

విద్యార్థులకు ఉపయోగకరం



మా పాఠశాలలో తొలిసారిగా డిజిటల్ పాఠ్యాంశాలు బోధిస్తున్నాం. 8, 9, 10 తరగతుల విద్యార్థులు డిజిటల్ పాఠ్యాంశాలను శ్రద్ధతో వింటున్నారు. రోజురోజుకూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఈ డిజిటల్ బోధన విద్యార్థులకు ఉపయోగకరంగా మారింది.

– యలమర్తి శౌరి, ప్రధానోపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, సిరిపురం

రైతులను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



గుడిబండలో రైతు యుద్ధభేరి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ చాలు అంటూ కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో గల రైతు వేదికలో నిర్వహించిన రైతు యుద్ధభేరి సమావేశంలో ఆయన మాట్లాడారు. నాటి ఆంధ్ర పాలకులు ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే రాష్ట్రం అంధకారం అవుతుందని విమర్శించారని కానీ నేడు రాష్ట్రంలో వ్యవసాయానికి కోతల్లేని విద్యుత్‌ను అందిస్తూ సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచారని అన్నారు. రైతులు ఇవన్ని గమనించాలని 24 గంటల విద్యుత్ ఇస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలన్నారు. సీఎం కేసీఆర్ అందజేస్తున్న అనేక పథకాలను తీసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరిగి ఆయననే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి శేషు, వైస్ ఎంపీపీ మల్లెల రాణి, సర్పంచ్‌లు దొంగల లక్ష్మీనారాయణ, మస్తాన్, అంబేద్కర్, తిరపయ్య, ఎంపీటీసీ శంకరశెట్టి కోటేశ్వరరావు, సలీం, శేషు, ఖాజాగౌడ్, అన్నెం అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి



హుజూర్‌నగర్‌లో మల్లయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ : కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. హుజూర్‌నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోడి మల్లయ్య శనివారం గుండెపోటుతో మరణించారు. ఆయన మృతదేహాన్ని ఆమె సందర్శించి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా ఇటీవల మరణించిన అరిబండి సీతమ్మ పెద్దకర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భాస్కరుని రామారావును ఆమె పరామర్శించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్, దొంగరి వెంకటేశ్వర్లు, గల్లా వెంకటేశ్వర్లు, సాముల శివారెడ్డి, పోతుల జ్ఞానయ్య, కోతి సంపత్‌రెడ్డి, జక్కుల మల్లయ్య, జి.రాములు, బంటు సైదులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం

హుజూర్‌నగర్ : పట్టణంలో నిర్వహిస్తున్న పీర్ల పండుగకు హాజరు కావాలని కోరుతూ ముజావర్లు షేక్ సైదా, నాగుల్ మీరా, మొయిన్‌లు శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మావతిని ఆహ్వానించారు. ఈమేరకు పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో ఆమెను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు.

కేఎల్‌ఎన్‌రావు సేవలు చిరస్మరణీయం



కేఎల్‌ఎన్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామ వెలుగు నాట్యమండలి సభ్యులు

మునగాల : తెలంగాణ నాటక తొలి రచయిత కేఎల్ ఎన్‌రావు సేవలు చిరస్మరణీయమని గ్రామ వెలుగు నాట్యమండలి అధ్యక్షుడు పొనుగోటి రంగా, కేఎల్ మెమోరియల్ ట్రస్టు కార్యదర్శి పందిరి పుల్లారెడ్డి అన్నారు. శనివారం కేఎల్‌ఎన్‌రావు 21 వర్ధంతి వేడుకలను ఆయన స్వగ్రామమైన రేపాలలో గ్రామవెలుగు నాట్యమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయం ఎదురుగా గల ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రేపాలలో గ్రామవెలుగు నాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, తొలి తెలంగాణ మాండలిక కవిగా దూరదర్శన్‌లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఎన్నో నాటకాలు రచించి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి కేఎల్‌ఎన్‌రావు అని కొనియాడారు. 1946లో రేపాలలో గ్రామవెలుగు నాట్యమండలిని స్థాపించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కళాకారులు గవిని కోటయ్య, మాచర్ల రామయ్య, సారిక లింగయ్య, సొంటి పరుశరాములు, గుండు నారాయణ, గవిని పెద్ద లక్ష్మీనర్సు, సారిక పెద్ద రామయ్య, బత్తుల నర్సయ్య, జూనియర్ కళాకారులు సైదులు, రాజాబాబు, వెంకటేశ్వర్లు, హనుమంతు పాల్గొన్నారు.

పీడిత ప్రజల గొంతుక దాశరథి



కోదాడఅర్బన్ : దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కోదాడఅర్బన్ : కోదాడలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రజాకవి దాశరథి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ పీడిత ప్రజల గొంతుక దాశరథి అని అన్నారు. నా తెలంగాణ కోటి తరనాల వీణ అని ఎలుగెత్తి చాటి, నిజాం నిరంకుశ పాలనను పిశాచమా అని దిక్కరిస్తూనే ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా తన గళాన్ని తన కలాన్ని ఎక్కుపెట్టి పోరాడిన కవి దాశరథి కృష్ణమాచార్యులు అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి, తెలుగు లెక్చరర్ వేముల వెంకటేశ్వర్లు, అధ్యాపకులు గురవయ్య, వాసు, యాదగిరి, బి.సైదులు, డీఎస్‌రావు, తుల్జారాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

కోదాడఅర్బన్ : కోదాడలోని గ్రంథాలయంలో ప్రజాకవి దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ షేక్ రహీం, లైబ్రరియన్ మంగా, రాధాకృష్ణ, పుప్పాల కృష్ణమూర్తి, నరసయ జార్జి, హనుమంతరావు, వెంకట్, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తిరునక్షత్ర పూజలు



పల్లకీసేవ నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలోని శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం శ్రీగోదాదేవి అమ్మవారి తిరునక్షత్ర పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, విశ్వక్సేన, పుణ్యాహవచనం, అమ్మవారికి కలశాభిషేకం, చీర అలంకరణ, పుష్పాలంకరణ, విష్ణు సమస్రనామం, కుంకుమార్చన, తిరుప్పావై, సేవాకాలం అనంతరం గోదాదేవి అమ్మవారికి పల్లకీసేవ, ఆరగింపు, మంగళాశాసనం, తనియ విన్నపం, తీర్థప్రసాద గోష్టి, తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ధర్మకర్తలు సురభి కుషల్, రామకృష్ణ, ఈఓ లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ రాధికాఅరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, రామస్వామి, లింగయ్య, గౌతమిగోపి, గురవయ్య, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల పరిశీలన

నడిగూడెం : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డుకు ఎంపికైన మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో శనివారం కోదాడ క్లస్టర్ ఏపీడీ అన్సారీ పర్యటించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాలు రెండు పూర్తయయ్యాని, మూడింటి పనులు జరుగుతున్నాయని, అలాగే వ్యక్తిగత ఇంకుడు గుంతలు 10 మంజూరు కాగా ఆరు పూర్తయయ్యాయని, నాలుగింటి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ యర్ర.లింగారెడ్డి, ఏపీఓ నగేష్, సర్పంచ్ లంజపల్లి నాగేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి ప్రత్యూష, ఈసీ ఉమ్లానాయక్, టిఏ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నసీమా ఉన్నారు.

రాజ్యాధికారంతోనే బహుజనుల అభివృద్ధి

కోదాడ : బహుజనులు ఓటును ఆయుధంగా ఉపయోగించుకొని రాజ్యాధికారాన్ని సాధించుకున్నప్పుడే అభివృద్ధి చెందుతారని, ఆ దిశగా ప్రతి బహుజన బిడ్డ ఆలోచన చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం కోదాడలోని బీఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నడిగూడెం మండలం చాకిరాలకు చెందిన న్యాయ పరిరక్షణ సేవా సమితి సభ్యుడు మాతంగి ఏసుబాబు ఆయన సమక్షంలో బీఎస్పీలో చేరారు. కార్యక్రమంలో సాలే చంటి, కాంపాటి శ్రావణ్‌కుమార్, షేక్ అజార్‌బాబా, నూకగోపాలస్వామి, కొండా ఉపేందర్‌గౌడ్, కృష్ణ, వీరస్వామి, వెంకటేష్, గురుస్వామి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం

నేరేడుచర్ల : రైతుల పట్ల బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొంగనాటకాలు ఆడుతూ మోసం చేస్తున్నాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యానారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్షాలు కురువక చెరువులు, బోరుబావుల్లో నీళ్లు అడుగంటి ఇబ్బందులు పడుతున్న రైతుల గురించి పట్టించుకోకుండా విద్యుత్ సరఫరా విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ధర్నాలు, రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు ఉచితంగా యూరియా, సబ్సిడీపై విత్తనాలు ఇవ్వడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు.

పంచాయతీ కార్మికులపై కక్షసాధింపు మానుకోవాలి



గరిడేపల్లిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

మోతె : పారిశుద్ధ్య కార్మికులపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మటిపెల్లి సైదులు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట 17 రోజులుగా నిరసన దీక్ష కొనసాగిస్తున్న గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శనివారం ఆయన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు గుంటగాని ఏసు, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ వర్కర్స్ అధ్యక్షుడు చిట్యాల రవిచంద్ర, నాయకులు జలగం తిర్పతయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ సంఘం నాయకులు కొండ సైదులు, చంద్రయ్య, రమేష్, సత్యం, వెంకన్న, నర్సిరెడ్డి, శ్రీను, జానయ్య, గోపి, గౌరమ్మ, కనకమ్మ, లింగమ్మ తదితరులు ఉన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

మఠంపల్లి : గ్రామ పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం రెగ్యులరైజ్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా కోరారు. మండల కేంద్రంలో 17 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు సీపీఎం తరపున సంఘీభావం తెలిపి మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, ఎం.మైసయ్య, మోతీలాల్, పిచ్చయ్య, గురువారెడ్డి, దేవదానం, సుశీల, నాగయ్య, అంజయ్య, బాలు, దావీదు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

మునగాల : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి బాదె నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గత 17 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు శనివారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, జీపీ కార్మికుల వర్కర్స్, యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు ఎం.వెంకన్న, పి.నర్సయ్య, పసరం, బి.పరుశరాములు, టి.ముత్తయ్య, డి.సైదులు, ఎస్.గోపిరెడ్డి, టి.రమేష్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్మికులకు మద్దతు

నడిగూడెం : గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని మానవ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు పందిటి క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్లకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్, గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు చిమట నాగరాజు, వెంకన్న, సుభాని, ఆంజనేయులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి కార్మికుల వినతి

గరిడేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం మహాత్మా గాంధీ విగ్రహానికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు యాకుబ్ మాట్లాడారు. నాయకులు గోపగాని సత్యం, కొండ సైదులు, మచ్చ సైదులు, వెంకన్న, శ్రీనుచారి, ముత్తయ్య, బాలకృష్ణ, మౌలానా, నర్సిరెడ్డి, వెంకన్న తదితరులు ఉన్నారు.

అంగుళం సుద్దముక్కపై జాతీయ జెండా ప్రతిమ



కోదాడఅర్బన్ : త్రివర్ణ పతాకాన్ని భారత రాజ్యాంగం పరిషత్ జాతీయ జెండాగా ఆమోదించిన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వెగ్గలం నరేష్ శనివారం అంగుళం సుద్దముక్కపై జాతీయ జెండా ప్రతిమను ఆవిష్కరించి తన కళా నైపుణ్యంతో దేశభక్తిని చాటుకున్నాడు. నరేష్ గతంలో సుద్దముక్కపై అనేక ఆవిష్కరణలు రూపొందించి తన కళాత్మకతను చాటుకున్నాడు. ఇప్పటికే అనేక బిరుదులు, అవార్డులు సొంతం చేసుకున్నాడు.

నడిగూడెం వాసులకు సీఐగా పదోన్నతి



కైగూరి నాగరాజు



కృష్ణంరాజు

నడిగూడెం : మండలంలోని వెంకట్రాంపురం(పెరికగూడెం) గ్రామానికి చెందిన కై గూరి నాగరాజు పోలీసు శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రమోషన్ లిస్టులో నాగరాజు ఉన్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. నాగరాజుకు పదోన్నతి రావడంతో వెంకట్రాంపురం గ్రామానికి చెందిన పలువురు ఆయనను అభినందించారు. అదేవిధంగా మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ఆర్.కృష్ణంరాజు సీఐగా పదోన్నతి పొందారు.

రుణమాఫీ చేయాలని వినతి

గరిడేపల్లి : ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా లక్ష రూపాయల రుణమాఫీని వడ్డీతో సహా అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. రుణమాఫీని వడ్డీతో సహా చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, కడియాల అప్పయ్య, అంజిరెడ్డి, వెంకన్న, గోవింద్‌రెడ్డి, నబిసాహెబ్, తిరుపతయ్య ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మోతెకు ఎమ్మెల్యే రాక

మోతె : మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆదివారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ రానున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిదులు హాజరు కావాలని వారు కోరారు.

ఆరోగ్య కేంద్రం పరిశీలన

చిలుకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ శిరీషానాగేంద్రబాబులు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని ఆపరేషన్ గది, ఓపీ గదిని పరిశీలించారు. ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీటీసీ కల్యాణి కోటేష్, డాక్టర్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎం ఇందిర పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వేణుగోపాలపురం సర్పంచ్ గందమళ్ల స్వరూప కోరారు. శనివారం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థికసాయం

మేళ్లచెరువు : మండల కేంద్రంలో పదిమంది నిరుపేదలకు 10 వార్డు సభ్యురాలు సాముల ఉమాపిచ్చిరెడ్డి శనివారం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ శంకర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పేదలకు చేయూతనందించిన ఉమాపిచ్చిరెడ్డిని పలువురు ఈ సందర్భంగా అభినందించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కోదాడరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీఆర్‌ఎస్ కార్యకర్తలపై ఉందని గ్రామ సమన్వయ కర్త, మండల ఉపాధ్యక్షుడు అన్నెం అంజిరెడ్డి, సాధినేని అప్పారావులు అన్నారు. శనివారం మండల పరిధిలోని రెడ్లకుంటలో సంక్షేమ పథకాలపై గడప గడపకు వెళ్లి అవగాహన కల్పించారు. మల్లెల బ్రహ్మయ్య, సతీష్, పుల్లారావు, పుల్లిసాహెబ్, హరిబాబు, సాయి తదితరులు ఉన్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి సర్వే

చిలుకూరు : మండల కేంద్రంలోని హరిజనవాడ సమీపంలోని పెట్రోల్ బంక్ వెనుక గల ప్రభుత్వ భూమిని శనివారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. హరిజనవాడలోని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చి భూమి కేటాయించలేదని, తమకు ఇవ్వాల్సిన భూమి ఆక్రమణకు గురైందని తక్షణమే అధికారులు సర్వే చేపట్టి తమకు కేటాయించాలని హరిజనవాడకు చెందిన శ్రీమన్‌నారాయణ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ భూమిని ఆర్ఐ మంజుల, సర్వేయర్ నాగేశ్వరరావులు సర్వే చేశారు. హరిజనవాడవాసులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా నేడు ర్యాలీ

కోదాడఅర్బన్ : మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు, స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, పాస్టర్లను ఘోరంగా అవమానించి చంపుతున్న ఘటనలకు నిరసనగా ఆదివారం కోదాడలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు పాస్టర్స్ అసోసియేషన్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు జీఆర్ అబ్రహం, చీఫ్ కోఆర్డినేటర్ రెవరెండ్ వి.యేషయ్యలు తెలిపారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సభ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ర్యాలీ, బహిరంగ సభకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాప్రతినిధులు మద్దతు ఇవ్వాలని వారు కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ స్థాయి పాస్టర్లు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శనివారం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ తనకు రావాల్సిన 12 సంవత్సరాల ఇంక్రిమెంట్ బిల్ చేయమంటే రూ.15 వందలు లంచం ఇస్తేనే చేస్తానని బెదిరింపులకు పాల్పడుతుందంటూ ఆయన వాపోయారు. లంచం ఇవ్వమంటే జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేస్తానని చెప్పినా ఆమె వినకపోవడంతో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌కు ఈనెల 19న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ వివరణ కోరగా జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌కు రావాల్సిన ఇంక్రిమెంట్ విషయంపై జెడ్పీ కార్యాలయానికి ప్రతిపాదనలు పింపినట్లు తెలిపారు. అక్కడి నుంచి ప్రపోజల్ వచ్చిన తరువాత బిల్ చేస్తానని అన్నందుకు భాస్కర్ మహిళనైన తనపై చెయి చేసుకోవడానికి ప్రయత్నించాడని ఆరోపించారు.

ఈవీఎంలపై అవగాహన

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఎన్నికల్లో ఓటు వేసే ఈవీఎం మిషన్‌లపై అవగాహన కల్పించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎమ్‌లపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పాదయాత్రకు సంఘీభావం

మునగాల : అమరావతిని రాజధానిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ నుంచి అమరావతి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొలికపూడి శ్రీనివాసరావు చేపట్టిన పాదయాత్రకు శనివారం మండలంలోని నర్సింహాపురం గ్రామపంచాయతీ పరిధిలోని ద్వారకానగర్ వద్ద సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. గోలి పూర్ణచందర్‌రావు, బారి లక్ష్మయ్య, రవి, ప్రదీప్ పాల్గొన్నారు.